క్లుప్తంగా

తిమ్మరాజుపేటలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు



తిమ్మరాజుపేట శ్మశానవాటిక అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న దృశ్యం

మునగపాక : తిమ్మరాజుపేటలో శ్మశానవాటిక అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. శ్మశానవాటిక అభివృద్ధికి జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, స్థానిక ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ రూ.7.50 లక్షల నిధులు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. దీంతో పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, వార్డు సభ్యుడు శరగడం గౌరీశ్వరరావు, పార్టీ ప్రచార కార్యదర్శి పెంటకోట రామప్పారావు తదితరులు పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు జగన్ తెలిపారు.

పాల్తేరులో ఏకాహం



రామాలయంలో ఏకాహం నిర్వహిస్తున్న భజన బృందం

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు గ్రామ రామాలయంలో ఏకాహం నిర్వహిస్తున్నారు. ముత్యాలమ్మగుడి వద్ద నున్న రామాలయంలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ఏకాహం నిర్వహిస్తారు. పాల్తేరు, అంకంపేట గ్రామాలకు చెందిన భజన బృందాలు పాల్గొని భక్తి శ్రద్ధలతో ఏకాహం నిర్వహిస్తున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఏకాహం బృందాలకు, ఆలయానికి హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

అంబేడ్కర్ జయంతి విజయవంతానికి పిలుపు



కరపత్రం విడుదల చేస్తున్న కృష్ణస్వరూప్

పాయకరావుపేట : డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ జయంతిని అందరూ విజయవంతం చేయాలని డి.బి.పి. జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ తెలిపారు. ఈ నెల 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాలు అన్నీ విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన కరపత్రం విడుదల చేసారు.

చలివేంద్రం ప్రారంభం



దిమిలిలో గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద చలివేంద్రం

రాంబిల్లి: దిమిలి తామరచర్ల వీధి గౌరీ పరమేశ్వరుల ఆలయం వద్ద ఆదివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. మన ఊరు మన వంతు సేవ కార్యక్రమంలో భాగంగా గౌరీ యూత్, నూకాంబిక యూత్ ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ప్రతి ఆదివారం మజ్జిగ, పిల్లలకు రస్న అందుబాటులో వుండగా మిగిలిన రోజుల్లో చల్లటి తాగునీరును అందుబాటులో ఉంచనున్నారు.

స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలుకు కృషి

మునగపాక : జగనన్న స్వచ్ఛ సంకల్పం శతశాతం అమలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు అన్నారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న సంపద తయారీ కేంద్రం పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం ద్వారా గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సంపద తయారీ కేంద్రం పూర్తయితే ప్రజలకు వినియోగంలోకి వస్తుందన్నారు. ఆయన వెంట పంచాయతీ వార్డు సభ్యుడు ఆడారి సత్యనారాయణ, రవికుమార్, ఉదయకుమార్ పాల్గొన్నారు.

ఆశాజనకంగా రబీ వరి పంట

- వేసవిలోనూ శారద నదిలో పుష్కలంగా నీరు
- మరో 10 రోజుల్లో రబీ కోతలు



మురకాడ గ్రామ సమీపంలో రబీ వరి



ఆశాజనకంగా వరి వెన్నులు



కట్టుబోలు వద్ద శారద నదిలో నీరు

రాంబిల్లి : వేసవి కాలంలోనూ శారద నదిలో నీరు పుష్కలంగా ప్రవహిస్తోంది. రబీ వరి సాగుకు ఈ ఏడాది సాగు నీటి ఇక్కట్లు తప్పాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మేజర్, మైనర్ శారద నదులు రెండింటిలోనూ నీరు ప్రవహిస్తోంది. ఈ ఏడాది మండలంలో సుమారు 3వేల ఎకరాల్లో రబీ వరిపంటను రైతులు సాగుచేశారు. మర్రిపాలెం, మురకాడ, దిమిలి, రజాల, కుమ్మరాపల్లి, రజాల అగ్రహారం తదితర గ్రామాల పరిధిలో రబీ వరిపైరును రైతులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ పంట సాగు తగ్గింది. ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో నీటి ముంపుకు ఖరీఫ్ వరి మునిగిపోవడం రైతులు నష్టపోవడం జరుగుతుండటంతో ఈ ఏడాది రబీ సాగు పెరిగింది. ఖరీఫ్ సాగు చేయకుండా కొందరు రబీ సీజన్‌కు సాగు చేసారు. మరికొందరు రైతులు ఖరీఫ్ అనంతరం రబీ సీజన్‌కు వరి పంటను సాగు చేశారు. రైతులకు అవసరమైన వరి విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వం రైతులకు అందజేసింది. 1010, ఇంద్ర, నెల్లూరు సన్నాలు ఇతర రకాలను రైతులు సాగు చేశారు. రైతులకు అవసరమైన సూచనలు, సలహాలను పొలంబడి కార్యక్రమాలతో పాటు తరచూ సందర్శించి వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ఆర్‌బీకే వీఏఏలు అందజేసారు. ఎరువులు సమస్య లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది పెద్దగా తెగుళ్ల బెడద లేదు. సాగునీరు సమస్య లేకుండా పోయింది. దీంతో సాగు ఖర్చులు తగ్గాయి. శారద నదిలో నీరు లేకపోతే వరి పంట దెబ్బతినాల్సి వచ్చేదని, బావులు, బోర్లు వున్న చోట నీరు అందుబాటులో వున్నా అదనపు ఖర్చు, శ్రమ పడాల్సి వచ్చేదని రైతులు తెలిపారు. ఈ ఏడాది మాత్రం రబీ పైరు ఆశాజనకంగా ఉంది. వెన్నులు విరగ్గాసి కనిపిస్తున్నాయి. మంచి దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అక్కడక్కడ వరికోతలు ప్రారంభం కాగా మరో 10 నుంచి 15 రోజుల్లో పూర్తి స్థాయిలో వరి కోతలు ప్రారంభం కానున్నాయి. కాగా రబీ వరి ధాన్యాన్ని ఆర్‌బీకేలు ద్వారా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది.

6న సామూహిక హారతి నిర్వహించాలి



హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి) : ఈ నెల 6వ తేదీన చైత్ర శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని అన్ని దేవాలయాల్లోనూ సామూహిక హారతి నిర్వహించాలని సమరసతా సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి రమణ సూచించారు. అచ్యుతాపురం శ్రీకృష్ణ, శ్రీ ఆంజనేయ దేవస్థానం ఆవరణలో ఆదివారం జరిగిన సమరసతా సేవా ఫౌండేషన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు మాట్లాడుతూ ఈ నెల 9న అనకాపల్లిలో శ్రీ హనుమాన్ శోభాయాత్రకు అందరూ తరలి రావాలని కోరారు. ఈ సందర్భంగా హనుమాన్ శోభాయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. గ్రామాల్లో ధార్మిక కమిటీ బలపడాలని అన్నారు. కొణతాల జనార్ధన్, ద్వారపురెడ్డి బాబ్జి, రెడ్డి అప్పలనాయుడు, త్రినాథ్, మేరుగు రాజారావు పాల్గొన్నారు.

పాలకులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి



అవార్డు పొందిన ఉద్యోగిని సత్కరిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): ప్రజలకు సేవలందించడంలో అధికారులు, పాలకులు మెరుగైన దక్షత, చొరవ చూపించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అన్నారు. అచ్యుతాపురం మండలంలోని మల్లవరంలో ఆదివారం ఇటీవల అవార్డులు పొందిన ఉద్యోగులను సత్కరించారు. నూతన గ్రామ పంచాయతీ ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సర్పంచ్ పిన్నంరాజు ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సుకుమార వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల పనితీరుని అభినందించారు. ఈ సందర్భంగా పాలక వర్గాన్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య లచ్చన్నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు, పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, ఎంపీటీసీ రావి నాగలక్ష్మి, సర్పంచ్ గంగిరెడ్డి లక్ష్మి రాము, ఉప్పవరం మాజీ సర్పంచ్ చిన్ని శ్రీనివాసరావు, మల్లవరం మాజీ సర్పంచ్ కండివల్లి శ్రీనివాసరావు, చందక శివ తదితరులు పాల్గొన్నారు. కార్యదర్శి ఫణీంద్ర, రావాడ నాగేశ్వర రావు, ఆశా కార్యకర్త మట్ట సన్యాసమ్మలను సత్కరించారు.

చదవడం అలవాటు చేసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మా ఊళ్లో గ్రంథాలయం గౌరవ అధ్యక్షుడు దక్షిణామూర్తి

మునగపాక : ప్రతి ఒక్కరూ చదవడం అలవాటు చేసుకోవాలని తద్వారా విజ్ఞానాన్ని పెంచుకోవచ్చని మా ఊళ్లో గ్రంథాలయం గౌరవ అధ్యక్షుడు ఆడారి దక్షిణామూర్తి అన్నారు. గ్రంథాలయం ఆధ్వర్యంలో రెండు వారాలుగా విద్యార్థులకు ×చదువంటే నాకిష్టం× కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇంతవరకు ఈ కార్యక్రమం ద్వారా కలిగిన ఫలితంపై ఆదివారం పాటిపల్లి రామాలయంలో విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. పుస్తకాలు చదవడం ద్వారా పఠనాశక్తితో పాటు విలువలు, జ్ఞానం, మాట్లాడే శక్తి పెరుగుతుందన్నారు. చదువులో కూడా రాణించవచ్చన్నారు. గ్రంథాలయ కోశాధికారి యల్లపు సంజీవ రావు, సభ్యులు ఏవీఎస్ మూర్తి, భీశెట్టి ధనశ్రీను, ఆడారి అప్పలనాయుడు కార్యక్రమంలో పాల్గొన్నారు. బాగా మాట్లాడిన పిల్లలకు బహుమతులు అందజేశారు.

గ్రంథాలయంలో చిల్డ్రన్స్‌క్లబ్ ఏర్పాటు



గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ క్లబ్‌కు వచ్చిన విద్యార్థులు

నక్కపల్లి : చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో ఆదివారం చిల్డ్రన్స్ క్లబ్‌ను ఏర్పాటు చేసినట్లు గ్రంథాలయాధికారి కె.జనార్దన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో నీతికథలు, పుస్తకాలు చదివించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులతో ఈ క్లబ్ ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. సుమారు 20 మంది విద్యార్థులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఉపమాక ఆలయ సమస్యలు పరిష్కరించండి

- టీటీడీ చైర్మన్‌కు వీసం వినతి



సుబ్బారెడ్డికి ఉపమాక వేంకటేశ్వరస్వామివారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న వీసం రామకృష్ణ

నక్కపల్లి : టీటీడీ అనుబంధ దేవాలయం ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో తిరుమల తిరుపతి దేవస్థానం తరపున చేపట్టాల్సిన అభివృద్ధి పనులు వెంటనే చేపట్టాలని చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డిని కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ కోరారు. ఆదివారం పాయకరావుపేట వెళ్తున్న సుబ్బారెడ్డిని నక్కపల్లిలో వీసం రామకృష్ణ, ఆలయ అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్, తదితరులు కలిసారు. ఈ సందర్భంగా వీసం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉపమాక ఆలయాన్ని టీటీడీ దత్తత తీసుకుందన్నారు. అప్పట్లో హామీ ఇచ్చిన అభివృద్ధి పనులను నెరవేర్చలేదన్నారు. కొండపైకి ఘాట్ రోడ్డు నిర్మాణం, కాటేజీలు, జాతీయ రహదారి నుంచి ఉపమాక వరకు రోడ్డు విస్తరణ, పుష్కరిణి అభివృద్ధి, కల్యాణ మండపాల నిర్మాణం, కొండపై మెట్ల మార్గంలో బాలాలయ నిర్మాణం, స్వామివారి మూలమూర్తి నమూనా విగ్రహం ఏర్పాటు, భక్తులకు తాగునీరు ఏర్పాటు, పార్కింగ్ ప్రాంతం వంటి అభివృద్ధి పనులను చేపడతామని సుమారు రూ.80 కోట్లు వెచ్చిస్తామని హామీ ఇచ్చారన్నారు. వీటిలో ఏవీ పూర్తి స్థాయిలో పరిష్కరించలేదన్నారు. భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. అలాగే ఇక్కడ పని చేసే సిబ్బందిని టీటీడీ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు ప్రయోజనాలు కల్పించడం వంటి సమస్యలను పరిష్కరించాల్సి ఉందన్నారు. వీటిని పరిష్కరించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దేవస్థానానికి వచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన సుబ్బారెడ్డి వచ్చే నెలలో పాయకరావుపేట పర్యటన ఉందని, ఆరోజు ఉపమాక ఆలయానికి వస్తానని, టీటీడీ ఉన్నతాధికారులను రప్పించి గతంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వామివారి చిత్రపటాన్ని సుబ్బారెడ్డికి అందజేశారు. సుబ్బారెడ్డిని కలిసిన వారిలో సర్పంచ్ నేతల రత్నకుమారి, పార్టీ సీనియర్ నాయకులు కర్రి బాబ్జి, అల్లాడ కొండ, ఎల్లేటి సత్యనారాయణ, జి.బంగార్రాజు, వెదుళ్ల పాపారావు, కొల్నాటి బుజ్జి ఉన్నారు.

నూకాంబిక ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న గ్రామ పెద్దలు

ఎస్.రాయవరం : తిమ్మాపురం నూకాంబిక అమ్మవారు హుండీ ఆదాయం రూ.37650 వచ్చినట్టు గ్రామపెద్దలు చెప్పారు. ఆదివారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు సమక్షంలో హుండీ ఆదాయం లెక్కించారు. ఇటీవల కొత్త అమావాస్య జాతర తరువాత మొదటిసారిగా ఈ ఆదాయం లెక్కించినట్టు వంగలపూడి గోవిందరావు తెలిపారు. దొంగల సమస్య ఉండడంతో ప్రతి మూడునెలలకి ఒకమారు అమ్మవారి హుండీ ఆదాయం లెక్కిస్తున్నట్టు తెలిసిందే.

సామాజిక విప్లవ రణభేరికి తరలిరండి..



రాట్నాలపాలెంలో కరపత్రం ఆవిష్కరిస్తున్న జైహో నాయకులు

కోటవురట్ల : జైభారత్ ఆధ్వర్యంలో ఈ నెల 16న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం వద్ద తలపెట్టిన జైభారత్ రాష్ట్ర ఐక్య సదస్సును విజయవంతం చేయాలని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.రమణ పిలుపునిచ్చారు. రాట్నాలపాలెంలోని డా.బి.ఆర్.అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద రాష్ట్ర సదస్సు సామాజిక విప్లవ రణభేరి కరపత్రాలను ఆదివారం ఆవిష్కరించారు. కుల నిర్మూలన, అసమానతల అంతం, విద్వేష రహిత సమాజం, కుల నిర్మూలన కోసం తలపెట్టిన ఐక్య వేదికను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ పోరాట వేదిక ఉపాధ్యక్షుడు ఎం.త్రిమూర్తులు, సర్పంచ్ బి.అనిల్‌కుమార్, మాజీ సర్పంచ్ దాసరి వెంకటరావు, జైహో ప్రతినిధులు రవికుమార్, ప్రసాద్, యేసు పాల్గొన్నారు.

అన్నదమ్ముల్లా కలిసిమెలిసి పనిచేద్దాం

మునగపాక : వర్గ విభేదాలు లేకుండా వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేసి వచ్చే ఎన్నికల్లో గెలుపు దిశగా పనిచేయాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మ అన్నారు. ఆదివారం మండలంలోని వాడ్రాపల్లిలో మునగపాక ఎంపీటీసీ సూరిశెట్టి రాము ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. పార్టీ శ్రేణుల నుంచి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొడ్డేడ ప్రసాద్, సుకుమారవర్మ మాట్లాడుతూ ప్రతి కుటుంబంలో అన్నదమ్ముల మధ్య, కుటుంబ సభ్యుల మధ్య చిన్నపాటి విభేదాలు వస్తాయని అంతమాత్రాన మన మంతా వేరుకాదన్నారు. తెలుసో తెలియకో చిన్న పాటి లోపాలు ఎక్కడైనా జరిగినా వాటిని సరిదిద్దుకుని వైఎస్సార్‌సీపీ కుటుంబంలో అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా నాయకులంతా అంతరాలు మరిచి సఖ్యతతో పనిచేయాలని పిలుపునిచ్చారు. త్వరలో మండల సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకొని సమస్యలపై చర్చించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు టెక్కలి కొండలరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు పాల్గొన్నారు.

టీటీడీ చైర్మన్‌కు ఘనస్వాగతం



టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డికి పాయకరావుపేటలో ఘనస్వాగతం పలికిన నాయకులు

పాయకరావుపేట : తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్, వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ వై.వి. సుబ్బారెడ్డికి పాయకరావుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. టీటీడీ చైర్మన్ సుబ్బారెడ్డి విశాఖపట్నం నుంచి తుని వెళ్తున్నారు. ప్రైవేట్ కార్యక్రమం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పాయకరావుపేట లింగాలకాలనీ వద్ద జాతీయ రహదారిపై సుబ్బారెడ్డి కాన్వాయ్‌ను ఆపి ఆయనకు స్వాగతం పలికారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ లంక సూర్యానారాయణలు చైర్మన్ సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి, పూలమాల, దుస్సాలువా వేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పార్టీ నాయకులు, పాయకరావుపేట సర్పంచ్, ఉపసర్పంచ్ లు గారా ఉష శ్రీ ప్రసాద్, జగతా భవానీ శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటీసీలు, పంచాయితీ వార్డు సభ్యులు సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతించారు.

కళాసీల ధర్నా



నినాదాలు చేస్తున్న కళాసీలు

రాంబిల్లి : రసూల్ డెకార్ పరిశ్రమ వద్ద కళాసీలు ఆదివారం ధర్నా నిర్వహించారు. వీరికి సీఐటీయూ నాయకుడు రొంగలి రాము మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెజ్ కోసం భూములు కోల్పోయిన రైతులు కళాసీలుగా జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కళాసీలు లోడింగ్, అన్‌లోడింగ్ చేసేటపుడు వాహనాల యజమానుల నుంచి సొమ్ము వసూలు చేసి ఆయా సొమ్మును పంచుకుంటున్నారు. అయితే ఇకపై ఎటువంటి సొమ్మును కళాసీలకు చెల్లించవద్దని కంపెనీ యాజమాన్యం చెప్పడం దారుణమని రాము విమర్శించారు. కళాసీలకు పాత పద్ధతిలోనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



వెంకటాపురం-రాంబిల్లి ప్రధాన రహదారిపై అప్పన్నపాలెం వద్ద వర్షం నీరు

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రంగా కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం పడింది. రోడ్లపై వర్షం నీరు పంట కాలువలను తలపిస్తూ ప్రవహించింది. పలు చోట్ల వర్షం నీరు నిల్వ చేరింది. వర్షంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన రైతులు ఇబ్బందులు పడ్డారు.

వేసవి దుక్కులకు అనుకూలంగా వర్షం

ఎస్.రాయవరం : మండలంలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది.గడిచిన వారం రోజులుగా ఎండ తీవ్రతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న మండల ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. సుమారు 45 నిమిషాలు కురిసిన వర్షంతో గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెరక ప్రాంతాల్లో వేసవి దుక్కులకు అనుకూలంగా కావచ్చని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం



స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

నక్కపల్లి: ప్రముఖ ప్రాచీన శివాలయం ఉపమాక శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో శివ పార్వతుల కల్యాణం శనివారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అంతకుముందు స్వామివారి ఆలయంలో విశేష హోమాలు నిర్వహించారు. స్వామివారిని పల్లకిలో ఊరేగించారు. ఎదురు సన్నాహ మహోత్సం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి కల్యాణాన్ని ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధానార్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, వెలవలపల్లి మహేష్ ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చరణల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించారు. కల్యాణం తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ప్రముఖ తెలుగు పండితురాలు డాక్టర్ వేదాల గాయత్రీదేవి, ఆలయ చైర్మన్ చెరుకూరి వెంకటేశ్వరరావు, స్థానిక నాయకులు కొల్నాటి బుజ్జి పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం



తిమ్మాపురంలో ఊరేగింపుగా వెళుతున్న చిన్నారులు



కోటవురట్ల కేకేబీ చర్చిలో చిన్నారులు

కోటవురట్ల : స్థానిక క్రీస్తు కృపాలయ బాప్టిస్టు చర్చిలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సండే స్కూల్ చిన్నారులు మట్టలను పూలతో అలంకరించి రాట్నాలపాలెం నుంచి చర్చి వరకు ర్యాలీ చేశారు. చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సండే స్కూల్ కరస్పాండెంట్ సంగీత్‌రాజ్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు జెరూసలేంలోకి ప్రవేశించిన సందర్భంగా మట్టల ఆదివారాన్ని జరుపుకొంటారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆనంద్‌రాజ్, టీచర్స్ జి.భవాని, బి.రాజేంద్రప్రసాద్, బి.చిట్టిబాబు, మెలోడీ, ఐశ్వర్య పాల్గొన్నారు. యాతపేటలో ఉన్న బేతస్థా ప్రార్థనా మందిరంలో మట్టల ఆదివారం జరిపారు. సండే స్కూల్ టీచర్స్ నిస్సీ, స్వరూప ఆధ్వర్యంలో చిన్నారులు మట్టలను చేత బట్టి హోసన్నా జయం అంటూ ర్యాలీ చేశారు. సంఘ కాపరి ఎలీషానంద్ వాఖ్య పరిచర్య చేశారు.

ఎస్.రాయవరం : మండలంలో మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ సోదరులు చిన్నారులతో కలిసి ఈత మట్టలకు పుష్పాలు అలంకరించి ఊరేగింపుగా వీధుల్లో తిరిగారు. తిమ్మాపురం, పెద గుమ్ములూరు, కొరుప్రోలు, ఎస్.రాయవరం, దార్లపూడి తదితర గ్రామాల్లో మట్టల ఆదివారం పెద్ద ఎత్తున నిర్వహించారు.

టెన్త్ పరీక్షలకు 738 మంది విద్యార్థులు



కొరుప్రోలు ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం

రాంబిల్లి : మండలంలో నాలుగు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పరీక్షలకు 738 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈవో మళ్ల సూర్యారావు తెలిపారు. రాంబిల్లి, పంచదార్ల, దిమిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలతో పాటు రాంబిలి రవీంద్ర ఉన్నత పాఠశాలలో పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల్లో వుండాలని, ఎటువంటి ఒత్తిడికి విద్యార్థులు లోను కాకుండా బాగా పరీక్షలు రాయాలని ఎంఈవో సూర్యారావు సూచించారు.

ఎస్.రాయవరం : మండలంలో సోమవారం నుంచి 1117 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నట్టు మండల విద్యాశాఖాధికారి ఏఎస్‌ఎన్ఏఎస్ మూర్తి తెలిపారు. ఇందులో 542 బాలురు, 575 మంది బాలికలు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. ఎస్.రాయవరం, కొరుప్రోలు, పి.ధర్మవరం, దార్లపూడి ఉన్నత పాఠశాలలో కలిపి తిమ్మాపురం శ్రీ ఆదర్శ పాఠశాలలో 10వ తరగతి పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు. ఉదయం 9.30 గంటల నుంచి 12.45 గంటల వరకు పరీక్ష సమయం ఉంటుందని, నిర్దిత సమయానికి ఒక నిమిషం కూడా ఆలస్యం కాకూడదని చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద బందోబస్తు నిమిత్తం పోలీసులు 144 సెక్షన్ అమల్లో ఉంచారని చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో ఇన్విజిలేటర్లకు, చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్ వారి వద్ద కూడా ఎట్టి పరిస్థితిల్లోనూ మొబైల్ వాడకుండా ఉన్నతాధికారులు ఆదేశాలు ఉన్నాయన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునే వరకు వారి కుటుంబ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు.